క్లుప్తంగా

ఆర్బీకేలను సందర్శించిన వ్యవసాయాధికారులు



తెనాలిటౌన్: రూరల్ మండలం తేలప్రోలు గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారులు సందర్శించారు. ఆర్బీకేలో ఉన్న ఎరువులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డీఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్బీకె సిబ్బంది పంట ఈ-క్రాప్ నమోదును త్వరగా పూర్తి చేయాలని కోరారు. రైతులకు సరిపడా ఎరువులు ఆర్బీకెలో ఉన్నాయని ఉపయోగించుకోవాలని కోరారు. పీఎం కిసాన్ అర్హులు ఉన్న రైతులు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు లింక్ చేయని వారు వీఆర్వోల ద్వారా లింక్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెనాలి ఏడీఏ ఎన్.ఉషారాణి, కొల్లిపర, తెనాలి, దుగ్గిరాల మండలాల వ్యవసాయాధికారులు వెంకట్రావు, ప్రేమ్‌సాగర్, శిరీష, తేలప్రోలు వీఏఏ హర్షిష్, రైతులు పాల్గొన్నారు.

1న రైల్వే గేటు సమస్యలపై సమావేశం



తెనాలి: వేమూరు మండల పరిధిలోని చినరావూరు-జంపని రైలుగేటును తెరిపించాలని కోరుతూ సెప్టెంబరు ఒకటో తేదీ ఉదయం 10.30 గంటలకు జగ్గడిగుంటపాలెంలో జరిగే అఖిలపక్ష రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. మంగళవారం జగ్గడిగుంటపాలెం, యడవూరు, చినరావూరు గ్రామాల్లో రైతులతో సమావేశాలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.4 కోట్ల నబార్డు నిధులతో రోడ్డు వేసినా, రైల్వేశాఖ గేటు తెరవకపోవటంతో ఎనిమిది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని రైల్వేశాఖతో మాట్లాడి రైతుల సమస్యను తీర్చాలని కోరారు. వీరితో ముద్దన సాంబశివరావు, తాటి వెంకటేశ్వర్లు, కుర్రా వెంకటరమణ, బొంతా సాంబశివరావు, బద్రి నారాయణ, దాది కోటేశ్వరరావు ఉన్నారు.

నేటి నుంచి సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



తెనాలిఅర్బన్: ప్రజలపై భారాలను నిలువరించండి- ఉపాధి అవకాశాలు కల్పించండి అనే నినాదంతో బుధవారం నుంచి సెప్టెంబర్ నాలుగు వరకు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ పేర్కొన్నారు. చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో నిరసన కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, డీజిల్, పెట్రోలు, బియ్యం, బస్సు, రైలు, విద్యుత్, కూరగాయాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆరోపించారు. ధరలను అదుపులో ఉంచడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, ఎస్.రాజ్యలక్ష్మి, వై.ఈశ్వరి, కె.రవికుమార్, జి.వెంకటసుబ్బయ్య, చుక్కపల్లి శేషగిరిరావు, శివయ్య, ఆర్.శివకృష్ణ, బ్రహ్మారెడ్డి, దుర్గాప్రసాద్, సాయి పాల్గొన్నారు.

మాంటిస్సోరి స్కూల్‌లో ఓనమ్ వేడుకలు



తెనాలిఅర్బన్: ఓనమ్ వేడుకలను బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ జేమ్స్ మోర్లె మాట్లాడుతూ కేరళలో జరుపుకునే అతి పెద్ద పండుగల్లో ఓనమ్ ఒకటి అని చెప్పారు. రంగులన్నీ కలిస్తేనే అందమని, అలాగే అందరూ ఐక్యతగా ఒకరికొకరు సహాయం చేసుకుంటూ జీవించాలనే సూక్తిని పండుగ తెలియజేస్తుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కేరళ వస్త్రధారణతో పాఠశాలకు వచ్చి నృత్యాలు చేశారు. పాఠశాలను ముగ్గులతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శివకుమార్



సంక్షేమ పథకాలకు సంబంధించి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: అగ్రవర్ణ పేదలకు కూడా సంక్షేమ పథకాలను ప్రభుత్వం ద్వారా అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం ఆరో రోజు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి తెలుసుకుని ఇంకా అర్హులు ఉండి పథకాలు అందనట్లయితే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను సచివాలయ ఉద్యోగులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ నవరత్నాలు పథకాల్లో భాగంగా ముఖ్యమంత్రి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. అగ్రవర్ణాల్లో పేదలు ఉన్నట్లయితే వారికి కూడా సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈబీసీ నేస్తం ద్వారా అర్హులకు పథకాలు అందిస్తామని చెప్పారు. గ్రామంలో రెండు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కాలిశెట్టి ఫణీకుమార్, దోసపాటి నాగదేవిక, సొసైటీ చైర్మన్ గంపల పెద్దబ్బాయి, పార్టీ నాయకులు అంచె రోశయ్య, వేజండ్ల రాధాకృష్ణమూర్తి, ప్రసాదం సురేష్, దూళ్ళ శ్రీనివాసరావు, కొలకలూరు నాగేశ్వరరావు, పినపాటి అనిల్, కార్తీకేయ, తులాబంధుల లక్ష్మీ కోటేశ్వరరావు, తాళ్లూరి అమ్మయ్య, తాడిబోయిన యలమందరావు, దర్శి గోపి, తాళ్లూరి వెంకట్రావు, కాలిశెట్టి వెంకటేశ్వరరావు, రావూరి రవిబాబు, షేక్ జిలానీ, కె.రాజయ్య, పామర్తి సుబ్బారావు, వీఆర్వోలు సురేష్, నితీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వైవిడి.ప్రసాద్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మండల స్థాయి అధికారులకు సూచనలు ఇస్తున్న న్యాయ పరివేక్షణాధికారి వాసంతి

కొల్లిపర: బాల్య వివాహాలు నిర్వహించడం చట్టపరంగా నేరం అని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై మండల స్థాయిలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాల్య వివాహాలపై పలు అంశాల గురించి అవగాహన కల్పించడానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి టి.దుర్గాభవాని, సిడిపిఓ ప్రాజెక్టు తెనాలి చైల్డ్ డిపార్టిమెంట్ అధికారి ఎం.సునిట్, న్యాయ పరివేక్షణాధికారి వి.వాసంతి, పాల్గొన్ని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 గురించి పూర్తిగా తెలుసుకుని దానిలోని పలు అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మండలంలో ఏ గ్రామంలోనైనా బాల్య వివాహాలు జరుగుతుంటే ప్రజలు, అధికారులు వెంటనే స్పందించి పోలీసులకు లేదా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ సంస్థ కోఆర్డినేటర్ కె.సమర్‌కుమార్, ఐసిడిఎస్ సూపర్ వైజర్స్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, మహిళ సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్స్‌లు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు ముందే సమస్యల పరిష్కారం

డివిజన్ స్థాయి సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాజకుమారి

తెనాలి: భూముల రీసర్వేలో ముందుగానే సమస్యలను గుర్తించి, పరిష్కరించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ×మీ భూమి-మా హామీ¥పై మంగళవారం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో డివిజన్‌స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డివిజనులోని మండల తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో జేసీ మాట్లాడారు. సర్వే చట్టం ప్రకారం ప్రతి యాభై ఏళ్లకోసారి భూముల రీసర్వే జరగాల్సి ఉందని, వందేళ్లయినా రాష్ట్రంలో రీసర్వే జరగని కారణంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు చెప్పారు. రీసర్వేతో భూవివాదాలకు ఆస్కారం ఉండదన్నారు. ప్రస్తుతం డివిజనులో దుగ్గిరాల, తెనాలి మండలాల్లో సర్వే జరుగుతోందని గుర్తుచేశారు. కొత్తగా పొన్నూరు, కాకుమాను మండలాల్లోనూ చేపడుతున్నట్టు తెలిపారు. రీసర్వే చేసే క్రమంలో కొన్ని పొరపాట్లు జరుగుతున్నందున, సర్వేకు ముందే వీటిని పరిష్కరించాలని రాజకుమారి చెప్పారు. ముందుగానే క్షేత్రస్థాయికి వెళ్లి సంబంధిత రైతులతో మ్యూటేషన్ పెట్టించాలని సూచించారు. అప్పటికే భూమిని అమ్మినట్టయితే సంబంధిత కొన్న రైతుతో చేయించాలన్నారు. భూమి యజమాని చనిపోతే, వారి లీగల్‌హైర్‌తో పెట్టాంచాలని చెప్పారు. ప్రభుత్వ భూములుంటే వాటి స్వభావాన్ని సర్వేకు ముందే సరిదిద్దాలని చెప్పారు. డెల్టా ప్రాంతంలో ఎక్కువగా కౌలురైతులు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. డెల్టా ప్రాంతంలో కౌలురైతులు అధికంగా ఉన్నందున వారికి ప్రభుత్వ ప్రయోజనాలు దక్కాటానికి అందరికీ కౌలురైతు గుర్తింపు కార్డులు వచ్చేలా చూడాలని కోరారు. రైతుభరోసా, పీఎం కిసాన్ పథకాల లబ్ధిదారులకు ఆధార్ కార్డు లింక్ కానందున, లబ్ధి చేకూరలేదని గుర్తుచేశారు. వెంటనే పూర్తిచేయించాలని ఆదేశించారు. అసైన్డ్ భూముల లబ్ధిదారులను విచారించి తగిన రికార్డును సిద్ధంచేయాలని చెప్పారు. క్షేత్రస్థాయి సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకుని, పరిష్కార మార్గాలను తెలియజేశారు.

మద్యం విక్రేత అరెస్ట్

మంగళగిరి: మండలంలోని కురగల్లు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కురగల్లుకు చెందిన రావూరి ప్రభుదాస్ కొంతకాలం నుంచి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం పక్కా సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ క్రాంతికిరణ్ తన సిబ్బందితో ఆకస్మికంగా దాడి నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ క్రీడాదినోత్సవం



తెనాలి: జాతీయ క్రీడాదినోత్సవాన్ని మంగళవారం సాయంత్రం స్థానిక చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడాస్టేడియంలో నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ పుష్పాంజలి ఘటించారు. స్టేడియంలో నడుస్తున్న హ్యాండ్‌బాల్ అకాడమీ చిహ్నంగా ఏర్పాటు చేసిన రంగుల లోగోను ఆవిష్కరించారు. అనంతర సభలో క్రీడాస్టేడియం అభివృద్ధి, అకాడమీ ఏర్పాటుతో ఏడాదిలోనే అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో ఇక్కడి క్రీడాకారులు పాల్గొనటం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. స్టేడియం అభివృద్ధికి మున్సిపాలిటీ తరపున సహకారం అందిస్తానని చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ చెప్పారు. హ్యాండ్‌బాల్ కోచ్ కె.నాగరాజు అధ్యక్షత వహించారు. పార్టీ నాయకులు ఎం.రాజేశ్వరరావు, బూరెల దుర్గాప్రసాద్, మార్కెట్‌యార్డు కమిటీ సభ్యుడు సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ పీఏ సునీల్ పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ క్రీడా వారోత్సవాలు

తెనాలిఅర్బన్: జగ్గడిగుంటపాలెంలోని కేంద్రీయ విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి జరుగుతున్న జాతీయ క్రీడా వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. విద్యార్థులు యోగా, మెడిటేషన్‌పై శిక్షణ ఇచ్చారు. అలాగే సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.శ్రీకాంత్, పీడీ బి.రవికుమార్, వాలీబాల్ కోచ్ డి.అజయ్, ఉపాధ్యాయులు టి.దీప్తి కమల్, కె.కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన పేదల సంక్షేమమే ఆశయం

- సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయం అవసరం
- సమష్టి కృషితో పేదలకు సేవలు అందించండి
- 21వ వార్డులో ఒకరోజులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సంక్షేమ పథకాలకు అర్హులైన పేదలు ఎవ్వరూ మిగిలిపోరాదని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. అలాగే ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలనేది తన లక్ష్యంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టంచేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అధికారులతో కలిసి సమన్వయంతో కృషిచేసినపుడే తన లక్ష్యం కార్యరూపం దాలుస్తుందని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పట్టణ 21వ వార్డులో మంగళవారం ×వార్డులో ఒకరోజు¥ కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయంలో సిబ్బందితో చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్, మున్సిపల్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావుతో కలిసి సమావేశమై, గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన వినతుల పరిష్కారాన్ని సమీక్షించారు. మొత్తం వినతులు 27 కాగా, వీటిలో 19 అభ్యర్థనలను పరిష్కరించారు. సాంకేతిక కారణాలతో నాలుగింటిని తిరస్కరించారు. మిగిలిన నాలుగు వినతులు పెండింగులో ఉన్నట్టు సిబ్బంది తెలియజేశారు. ఆయా పనులవారీగా వివరాలను ఎమ్మెల్యే శివకుమార్ తెలుసుకున్నారు. రేషనుకార్డు వచ్చిన కుటుంబం, అమ్మ ఒడి డబ్బులు పడిన లబ్ధిదారుతో నేరుగా ఫోనులో మాట్లాడగా, తమ అభ్యర్ధనను మన్నించినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు. మరోచోట చేతిపంపు వేయించినందుకు మరొకరు ధన్యవాదాలు తెలియజేశారు. అర్హత లేనందున తిరస్కరించిన అభ్యర్థనలను సంబంధీకులకు సమాచారం ఇచ్చినట్టు సిబ్బంది తెలిపారు. గడప గడపకు వినతుల్లో అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షలకు అదనంగా మరో రూ.8.70 లక్షలతో పనులు పూర్తిచేసినట్టు అధికారులు వెల్లడించారు. సమావేశం అనంతరం కొత్తగా నిర్మించిన రెండు సిమెంటు రోడ్ల శిలాఫలకాలను ఎమ్మెల్యే శివకుమార్ ఆవిష్కరించారు. వలంటీర్లతో మాట్లాడి వారి సమస్యలు, వార్డులోని సామాజిక సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా వార్డు పార్టీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్, రియాజ్‌ఖాన్ దంపతులతో కలిసి భోజనం చేశారు. తర్వాత పార్టీ ముఖ్యకార్యకర్తలు, గృహసారథులతో సమావేశమై, పలు అంశాలపై చర్చించారు. జనార్ధనరెడ్డి, రామిరెడ్డి, షేక్ ఆదాం, పాండురంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం



తెలుగు పండితులను సత్కరించిన పరిషత్ నేతలు



తెలుగు అధ్యాపకుడు కల్యాణ్ కుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

తెనాలి: బ్రాహ్మణ పరిషత్, తెనాలి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆంధ్రా భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు పండితుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు లక్కరాజు లక్షణరావు, ప్రముఖ భాషాపండితుడు నాగలింగం చిరంజీవి, అనంద శారదవరప్రసాద్, లక్కరాజు దుర్గ, చిలుమూరు రామలింగేశ్వరరావును సత్కరించారు. గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల సమర్పించారు. తెలుగు భాషా దినోత్సవం విశిష్టతను పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ వివరించారు. అధ్యక్షుడు పరాశరం వెంకట రామగోపాల్, కోశాధికారి వడ్లమాని ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు త్రిపురారిభొట్ల దత్తాత్రేయశాస్త్రి, వంగల మాధవ, చెన్నాప్రగడ శ్రీనివాసరావు, దీవి జీవన్ కుమార్, దావులూరు శ్యామ్‌సుందర్‌శర్మ, మానేపల్లి శేషగిరిరావు, జొన్నలగడ్డ సూర్యనారాయణ మూర్తి, పిసపాటి శివరామకృష్ణ, కావూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

భాష్యం స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం

తెనాలిఅర్బన్: తెలుగు భాషా దినోత్సవాన్ని బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. గిడుగురామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సరస్వతీ శిశు మందిర్‌లో గిడుగు రామమూర్తి జయంతి

తెనాలిటౌన్: సుల్తానాబాద్ కుమార్ కాలనీలోని సరస్వతీ శిశు మందిర్‌లో మంగళవారం గిడుగు రామమూర్తి జయంతిని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, పద్యపఠనంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కృపాచారి బహుమతులు అందజేశారు.

తెలుగు భాషా పరిరక్షణకు కృషి చేయాలి

తెనాలిఅర్బన్: తెలుగు భాషా పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల అధ్యక్షులు బొల్లిముంత అమరేశ్వరరావు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగుభాషాకు పొంచివున్న ప్రమాదం- పరిరక్షణ చర్యలు అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ తన్నీరు కళ్యాణ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చింతల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ, అధ్యాపకులు కాకుమాను వెంకటేశ్వరరావు, భోగిరెడ్డి సుబ్బారావు, రసూల్, జగన్‌మోహనరావు పాల్గొన్నారు.

ఒకటిన మహంకాళి ఆలయంలో శ్రావణ లక్ష్మీ వ్రతం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళి అమ్మవారి దేవస్థాన ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా శ్రావణ లక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రావణమాసం సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అమ్మవారికి ఓంకార జెండా ఆవిష్కరించబడునని, అనంతరం వేద మంత్రాలతో పూర్ణ కలశముతో, సన్నాయి మేళాలతో అమ్మవారికి శ్రావణ లక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని, కార్యక్రమంలో పాల్గొనే దంపతులు రూ.1116 చెల్లించి రశీదు పొందగలరని అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఆసక్తిగల భక్తులు శ్రావణ లక్ష్మీ వ్రతంలో పాల్గొని అమ్మవారి కృపకు ప్రాతులు కాగలరని కోరారు. ఆలయ అభివృద్ధికి, అన్నప్రసాదానికి వస్తు, ధన రూపేణా విరాళాలు ఇచ్చి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

ఆధునికతను సంతరించుకున్న మహాప్రస్థానం

- అధునాతన గ్యాస్ ఆధారిత దహనవాటిక ఏర్పాటు
- భౌతికకాయాల భద్రతకు మార్చురీ రూమ్
- మరో వారంరోజుల్లో పినపాడు మహాప్రస్థానం ప్రారంభానికి సిద్ధం



పినపాడు మహాప్రస్థానం



నూతనంగా నిర్మించిన గ్యాస్‌ఆధారిత దహనవాటిక




మార్చురీ రూమ్

తెనాలి:అది పిశాచులతో నిశలేక్షణుండు/ గజ్జ కదిలించి యాడు రంగస్థలంబు/ ఇది మరణదూత తీక్షణమౌ దుష్టలలయ/ అవని పాలించు భస్మ సింహాసనంబు¥- మహాకవి గుఱ్ఱం జాషువా తాత్వికతతో రాసిన పద్యంలోని పంక్తులివి. సామాన్యుల నుంచి కవులు, చిత్రకారులు, రాజుల వరకు చివరి మజిలీ ×ఇచ్చోటనే¥ అన్నారాయన. శ్మశానవాటికను నేటిజనం మహాప్రస్థానంగా పిలుస్తున్నారు. వదాన్యులు పూనుకుని నవీనకాలానికి తగినట్టుగా ఉద్యానవనాలుగా తీర్చిదిద్దుతున్నారు. తెనాలిలోని అలాంటి ఓ ఉద్యాన తరహా మహాప్రస్థానంలో గ్యాస్‌ఆధారిత దహనవాటికను, ఫ్రీజర్లతో కూడిన మార్చురీ రూమ్ నిర్మాణాలు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. జిల్లా కేంద్రమైన గుంటూరు తర్వాత ఉమ్మడి జిల్లాలో ఈ చాంబర్ సమకూర్చుకుని తొలి మహాప్రస్థానమిది. శ్మశానవాటికలు ఒకప్పుడు నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఉండేవి. అంతిమ సంస్కారాలకు భౌతికకాయంతో అక్కడకు వెళ్లాలంటే కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీవ్ర అసౌకర్యం అనిపించేది. ఆ తతంగం పూర్తయేంతవరకు చుట్టుపక్కల వారికీ ఇబ్బందిగా ఉండేది. ఒక మనిషి మరణించాక అంత్యక్రియలను సగౌరవంగా చేయటంకన్నా మించిన సేవ ఏముంటుంది? అన్న భావనతో కొందరు పౌరుల పూనికతో 2018లో తెనాలి మహాప్రస్థాన సేవాసమితి ఆవిర్భవించింది. పట్టణంలోని మూడు శ్మశానవాటికలను అందమైన ఉద్యానవనాలుగా తీర్చిదిద్దారు. అందులో పినపాడు శ్మశానవాటిక కూడా ఒకటి. 2020లో ప్రధాన కార్యదర్శిగా జెట్టి శివరామకృష్ణప్రసాద్ బాధ్యతలు చేపట్టాక గ్యాస్ ఆధారిత ఛాంబర్ ఏర్పాటు ఆలోచన చేశారు. దాతలు ముందుకొచ్చారు. తుమ్మల రాజారావు జ్ఞాపకార్థం హైదరాబాద్‌లోని టెరా సాఫ్ట్‌వేర్ సోదరులు తుమ్మల బాపయ్యచౌదరి, గోపీచంద్ రూ.15 లక్షలు సమకూర్చారు. అన్నవరపు రావు సుబ్బారావు జ్ఞాపకార్థం కుమారులు రూ.3 లక్షలు, పరుచూరి సుధాకరరావు రూ.లక్ష, పట్లూరి చినబసవయ్య జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు రూ.75 వేలు విరాళంగా ఇచ్చారు. మరికొంత కమిటీ నిధులు కలిపి రూ.26 లక్షలతో ఆధునిక గ్యాస్‌ఆధారిత దహనవాటికను నిర్మించారు. సంప్రదాయంగా కట్టెలపై కాల్చే విధానానికి బదులుగా తక్కువ సమయంలో ఆధునిక పద్ధతిలో దహనం చేయటం సంబంధీకులకు తేలిక. కాలుష్య రహితం కావటంతో పర్యావరణానికి, పరిసరాల్లోని ప్రజలకు ఇబ్బంది ఉండదు.

రూ.4.50 లక్షలతో మహాప్రస్థానం...

జిల్లా పరిషత్ విశ్రాంత సీఈఓ వీరమాసునేని మనోహర్ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాస్ అందజేసిన రూ.4.50 లక్షలతో మహాప్రస్థానం ఆవరణలోనే మార్చురీ రూమ్‌ను నిర్మించారు. ఇందులో రెండు ఫ్రీజర్లను ఏర్పాటుచేశారు. మైనస్ మూడు డిగ్రీలతో ఉండే ఈ ఫ్రీజర్లలో రెండు భౌతికకాయాలను భద్రపరచే వెసులుబాటు ఉంది. దహనవాటిక, మార్చురీ కోసమని ప్రత్యేకంగా త్రీఫేజ్ కరెంటు సౌకర్యం, 22 కేవీ జనరేటర్‌ను సమకూర్చుకున్నారు. గ్యాస్ ఆధారిత దహనవాటికలో ఏర్పాటుచేసిన మూడు బర్నర్లతో మృతదేహం కొద్దినిముషాల్లోనే దహనమవుతుంది. వెలువడే వాయువులు పైన అమర్చిన రెండు సైక్లోన్స్‌లోకి వెళ్లి, నీటిలో కలుస్తూ, జీరో పొల్యూషన్‌తో 100 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన చిమ్నీతో బయటకు వెళ్లిపోతుంది. అస్తికలు, చితాభస్మం దిగువనున్న ట్రేలోకి చేరతాయి. కుటుంబసభ్యులు వాటిని మహాప్రస్థానంలోనే గల లాకర్లలో భద్రపరచుకోవచ్చని శివరామకృష్ణప్రసాద్ చెప్పారు. మున్సిపాలిటీ నిధులు రూ.25 లక్షలతో ప్రహరీగోడ నిర్మాణం పూర్తికాగా, బంధుమిత్రుల కోసమని ప్రత్యేకంగా టాయ్‌లెట్ల నిర్మాణం పూర్తికావచ్చింది. వీరితోపాటు సేవాసమితి అధ్యక్షుడు ఢాకా సాంబిరెడ్డి ఉపాధ్యక్షుడు తుమ్మల బాపయ్య చౌదరి, సంయుక్త కార్యదర్శులు చదలవాడ శంకరప్రసాద్ (బుజ్జి), ఆర్ఎస్ శంకరరావు పర్యవేక్షించారు.

> **మరో వారంలో ప్రారంభిస్తాం...**
>
> 
>
> నూతనంగా నిర్మించిన గ్యాస్‌ఆధారిత ఛాంబర్‌ను, మార్చురీ రూమ్‌కు సహకరించిన దాతలు, అవసరమైన అన్ని అనుమతులు ఇప్పించి, మున్సిపల్ నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్‌కు ధన్యవాదాలు. వారంరోజుల్లో వారిచేతనే ప్రారంభింపజేస్తాం.
>
> – జెట్టి శివరామకృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి, మహాప్రస్థాన సేవాసమితి

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.జశ్వంతరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు. అలాగే ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై రూ.30,174 జరిమానా

తాడికొండ: తాడికొండ మండలం మోతడక గ్రామంలోని సర్వే నెంబర్ 201లోని పట్టా భూముల్లో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విజిలెన్స్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి రూ.30,174 జరిమానా విధించినట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. బిల్లులు లేకుండా తరలిస్తున్న మూడు లారీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.